క్లుప్తంగా

గ్రానైట్ లారీ సీజ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న గ్రానైట్ లారీ

గుడుపల్లె: అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్‌ను లారీతో సహా పోలీసులు సీజ్ చేశారు. శుక్రవారం మండలంలోని కమ్మగుట్టపల్లె వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. శాంతిపురం మండలం రాళ్లబూదుగూరు సమీపంలోని క్వారీల నుంచి తమిళనాడు రాష్ట్రానికి వెళ్తున్న గ్రానైట్ లారీని నిలిపి, ఎస్‌ఐ శ్రీనివాసులు పరిశీలించారు. ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా గ్రానైట్‌ను తరలిస్తున్నట్లు తెలుసుకుని సీజ్ చేశారు.

పెన్షనర్ల సమస్యలపై అవగాహన సదస్సు రేపు

పలమనేరు: పెన్షనర్ల సమస్యలపై పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో సెప్టెంబర్ 1న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ నాయకులు సోమచంద్రారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్వీస్ పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు పలు సమస్యలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారికి సలహాలు-సూచనలు ఇచ్చేందుకు ఈ సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. దీనిని పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం.. రాగి వైరు చోరీ



దొంగలు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్ పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

సదుం: ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి రాగి వైరును చోరీ చేసిన సంఘటన శుక్రవారం మండలంలో వెలుగులోకి వచ్చింది. వివరాలు.. ఊటుపల్లె పంచాయతీ తుమ్మగుంటపల్లెకు చెందిన కృష్ణమనాయుడు పొలాల వద్ద ఉన్న 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను, అలాగే నీరుగట్టువారిపల్లెకు చెందిన బయన్న పొలం వద్ద 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి వైరును దొంగలు చోరీ చేశారు. దీనిపై బాధిత రైతులు పోలీసులు, ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేశారు.

రిక్రియేషన్ క్లబ్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం రేపు

పలమనేరు: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న రిక్రియేషన్ క్లబ్‌లో సెప్టెంబర్1న ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నామని ఆ క్లబ్ నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అవసరమైన వారికి కంటి అద్దాలు ఇస్తామని, ఆపరేషన్లు కూడా చేయిస్తామని తెలియజేశారు. దీనిని పట్టణ, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిత్యాన్నదానానికి కూరగాయలు వితరణ



కూరగాయలు అందజేస్తున్న దాతలు

కాణిపాకం: స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో నిత్యాన్నదానానికి పలమనేరు చెందిన రవీంద్ర రెడ్డి బృందం రూ. 2 లక్షల విలువ గల కూరగాయలను శుక్రవారం వితరణ చేశారు. దాతలకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకు..

చిత్తూరు కలెక్టరేట్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద రావు అన్నారు. శుక్రవారం స్థానిక సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు టెక్నాలజీపై పట్టు పెంచుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ మనోహర్ మాట్లాడుతూ, ప్రాంగణంలో బీసీ వసతి గృహం, జిల్లా కేంద్రంలో సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపకులు వెంకటేశ్వరచౌదరి, బీజేపీ నాయకులు జగదీశ్వరనాయుడు, వైస్ ప్రిన్సిపల్ నరేంద్రకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిల్లు తీసుకోండి సామీ!

- ఎరువులు, విత్తనాల దుకాణాల్లో ఇవ్వని బిల్లులు
- మెడికల్ స్టోర్లలో మరీ ఘోరం
- వినియోగదారుల ఫోరానికి వెళ్లాలంటే బిల్లు కావాల్సిందే
- బిల్లులివ్వకుండా బురిడీ కొట్టిస్తున్న నిర్వాహకులు





పలమనేరులోని ఓ మెడికల్ స్టోర్, ఎరువులు, విత్తనాల దుకాణం

పలమనేరు: ఏ దుకాణంలోనైనా ఏవైనా వస్తువులు కొంటే దానికి సంబంధించిన బిల్లును కచ్చితంగా తీసుకోవాలని జిల్లా వినియోగదారుల ఫోరం హెచ్చరిస్తూనే ఉంది. అయితే దీనిని ప్రజలు పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఏదేనీ నాసిరకం వస్తువులను కొని మోసపోయిన బాధితులు కోర్టుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వినియోగదారుల హక్కులపై వీరికి అవగాహన లేక చాలా నష్టపోవాల్సి వస్తోంది.

ఇదిగో సాక్ష్యం..

బైరెడ్డిపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన రైతు మండల కేంద్రంలో వరి విత్తనాలను కొనుగోలు చేశాడు. దానికి సంబంధించిన బిల్లును తీసుకోలేదు. పంట సాగుచేశాక పంట చేతికందకుండా జల్లుపోయింది. దీనిపై ఆగ్రహించిన రైతు విత్తనాలను కొనుగోలు చేసిన దుకాణానికి వెళ్లి అడగ్గా తమకు సంబంధం లేదని తెలిపారు. దీంతో ఆయన వినియోగదారుల ఫోరానికి వెళ్లగా బిల్లు కావాలన్నారు. బిల్లు లేకపోవడంతో రెండెకరాల్లో సాగుచేసిన వరిపంట నష్టపరిహారం రాకుండా పోయింది.

ఇక మెడికల్ స్టోర్లలో ఇలా...

సాధారణంగా నిబంధనల మేరకు వినియోగదారుడు కొనుగోలు చేసిన వస్తువుకు దుకాణదారులు కచ్చితంగా బిల్లు ఇవ్వాలి. ఆస్పత్రిలో వైద్యులు రాసిచ్చిన ప్రిస్కిప్షన్ మేరకు మందులు ఇచ్చినా దానిపై ఎంత ఖరీదు చేశారో దానికి బిల్లులివ్వాలి. కొందరు డాక్టర్‌తో సంబంధం లేకుండా మందులు కొంటుంటారు. దానికి సైతం వారు బిల్లులివ్వాలి. కానీ ఎవరూ ఇవ్వడం లేదు. దీంతో ఏదేని సమస్య వచ్చినప్పుడు కొనుగోలుదారుడు ఏం చేయలేని పరిస్థితి కలుగుతోంది.

కచ్చితంగా బిల్లులివ్వాల్సిందే



ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందుల దుకాణాల్లో రైతులు కొన్న వస్తువులకు విధిగా బిల్లులివ్వాలని ఇప్పటికే ఆదేశించాం. వారు ఇవ్వకున్నా రైతులు అడిగి మరీ బిల్లు తీసుకోవాలి. చాలామంది దీన్ని అసలు పట్టించుకోవడం లేదు. ఆపై ఏదైనా ఇబ్బంది వస్తే మాత్రం మేము బాధ్యులం కాము.

–సంధ్య, ఏఓ, పలమనేరు

బిల్లు ఉంటేనే కోర్టులో న్యాయం



మనం ఏదైనా వస్తువును కొన్నప్పుడు తప్పకుండా దుకాణదారుని నుంచి బిల్లు పొందాలి. ఎందుకంటే ఆ వస్తువు కారణంగా మనకు ఇబ్బంది కలిగినప్పుడు దానిపై కోర్టుకు వెళ్లే అవకాశం ఉంటుంది. దీనిపై నిర్లక్ష్యం చేసి మనం పట్టించుకోకుండా వెళ్లిపోతుంటాం. అయితే న్యాయపరంగా మనం కంపెనీలపై పోరాడాలంటే కచ్చితంగా బిల్లుండాలి. అందుకే ఏ వస్తువు కొన్నా బిల్లు తీసుకోవాలి.

–సయ్యద్ మోహిద్దీన్, న్యాయవాది, పలమనేరు

గ్రామోత్సవంతో ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

బంగారుపాళెం: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని బంగారుపాళెంలో ఐదు రోజుల కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం గ్రామోత్సవంతో ముగిశాయి. స్థానిక రాజావీధిలో ప్రబోధానంద సేవా సమితి ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన మండపంలో శ్రీకృష్ణుడి విగ్రహానికి ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు చేశారు. మంగళ హారతులు ఇచ్చారు. తీర్థప్రసాదాల వితరణతో పాటు భగవద్గీత శ్లోకాలు వినిపించారు. చివరి రోజు శ్రీకృష్ణుడి విగ్రహాన్ని పల్లకిపై కొలువుదీర్చి మంగళ వాయిద్యాలు, చిన్నారుల కోలాట ప్రదర్శనలతో కోలాహలంగా గ్రామోత్సవం నిర్వహించారు.



శ్రీకృష్ణ భగవానుడి గ్రామోత్సవం

కార్యక్రమంలో త్రైత సిద్ధాంత కమిటీ సభ్యులు, కృష్ణభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గ్రామోత్సవంలో చిన్నారుల కోలాట ప్రదర్శన

తెలుగు భాషా పురస్కారాల్లోనూ వివక్షేనా?

పలమనేరు: తాజాగా రాష్ట్ర ప్రభుత్వం గిడుగు రామమూర్తి పంతుల పేరిట ప్రదానం చేసిన తెలుగు భాషా పురస్కారాల్లోనూ వివక్ష చూపిందని పట్టణానికి చెందిన తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం అన్ని ప్రాంతాలకు సమతూకాన్ని పాటిస్తూ 41మందికి సేవా పురస్కారాలను అందజేస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం 19మందికి మాత్రమే పురస్కారాలను ప్రకటించి ప్రదానం చేయడం సరికాదని ఆక్షేపించారు.

కమిషనర్ నరసింహప్రసాద్ బదిలీ



నరసింహప్రసాద్

పుంగనూరు: మున్సిపాలిటీ కమిషనర్ నరసింహప్రసాద్‌ను బదిలీ చేస్తూ డీఎంఏ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్ల క్రితం ఆయన ఇక్కడికి కమిషనర్‌గా వచ్చారు. సచివాలయాల ద్వారా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించేందుకు రాష్ట్రంలో తొలిసారిగా పుంగనూరు మున్సిపాలిటీలో అమలు చేసి విజయం సాధించారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంజూరు చేయించిన సోలార్ ప్రాజెక్టును కేవలం రెండు నెలల వ్యవధిలో పూర్తి చేయించి తన సత్తా చాటుకున్నారు. అలాగే ఎంతో వివాదాస్పదంగా మారిన పట్టణంలోని ఎంబీటీ రోడ్డు విస్తరణ పనుల్లో ఆక్రమణలను తొలగించారు. ఎల్‌ఈడీ దీపాలను ఏర్పాటు చేశారు. పట్టణ ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంలో చొరవ చూపారు.

వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

చిత్తూరు కార్పొరేషన్: వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగుల రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు శుక్రవారం శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో స్థానిక వాణిజ్య పన్నులశాఖ కార్యాలయం వద్ద ఏపీసీటీఎస్ఏ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన అక్రమాలు, రాష్ట్ర ఉన్నతాధికారుల అవినీతిపై దర్యాప్తు చేయాలన్నారు. ప్రాంతీయ కార్యాలయాలను రద్దు చేయాలన్నారు. జీఎస్టీఓలకు చట్టబద్ధమైన అధికారాలు కల్పించాలన్నారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించే వరకు ఆందోళన చేస్తామన్నారు. ఇదలా ఉంచితే, ఉద్యోగుల బదిలీల గడువు పెంచినందుకు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు పూర్ణం, నాయకులు గిరిధర్, జగదీష్‌బాబు, సురేష్‌బాబు, 4వ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

7న చవితి ఉత్సవాలు

వి.కోట: సెప్టెంబర్ 7వ తేదీ రాత్రి 7 గంటలకు వినాయక చవితి ఉత్సవాలను స్థానిక వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు శుక్రవారం ఆర్ఎస్ఎస్ నాయకుడు మైందల రామచంద్రుడు ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో వినాయకస్వామి మండపాలు ఏర్పాటు చేసే వినాక మండప కమిటీ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు , పట్టణ ప్రముఖులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సైన్స్, హిందీ టీచర్లు ఇంగ్లిష్ చెప్పాలట!

పలమనేరులోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో కొన్నేళ్లుగా హిందీ సబ్జెక్ట్ బోధిస్తున్న ఉపాధ్యాయురాలిని ఇకపై ఇదే మండలంలోని కొలమాసనపల్లె హైస్కూల్‌లో ఇంగ్లిష్ సబ్జెక్ట్ బోధించాలని విద్యాశాఖ ఆదేశించింది.

గంగవరం మండలం కల్లుపల్లె హైస్కూల్‌లోని ముగ్గురు సోషియల్ టీచర్లను హిందీ, ఆంగ్లం బోధించాలని పొన్నమాకులపల్లె, చిన్నమనాయునిపల్లెకు బదిలీ చేశారు. ఇదీ విద్యాశాఖ 'సర్దుబాటు' లీలలు..!

- ఉర్దూ టీచర్లు సాంఘిక శాస్త్రం పాఠాలు చెప్పాలని ఆదేశాలు
- అసంబద్ధంగా టీచర్ల సర్దుబాటు ప్రక్రియ
- ఇలాగేనా టీచర్ల కొరత తీర్చేదని మండిపడుతున్న టీచర్లు

పలమనేరు: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు ప్రభుత్వం టీచర్ల సర్దుబాటు ప్రక్రియకు పూనుకుంది. తొలినుంచీ సర్దుబాటు ప్రక్రియను ఉపాధ్యాయ సంఘాలు నిరసిస్తున్నాయి. అయితే ఇవేవీ పట్టించుకోకుండా అసంబద్ధంగా సర్దుబాట్లు చేస్తుండటంతో టీచర్లకు చిర్రెత్తుతోంది. పలమనేరు నియోజకవర్గంలో జరుగుతున్న టీచర్ల సర్దుబాటు ప్రక్రియ దీనికి అద్దం పట్టింది. స్థానికంగా సర్దుబాట్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. పదేళ్లుగా బయాలజీ, హి హిందీ సబ్జెక్టులు చెబుతున్న టీచర్లను సాంఘిక శాస్త్రం పాఠాలు చెప్పాలని పంపారు. ఇలా చేస్తే విద్యాప్రమాణాలు మెరుగుపడడం దేవుడెరుగు అసలు తమకు సంబంధం లేని పాఠాలను వీరు ఎలా బోధిస్తారనే ఇంగిత జ్ఞానం ఉండాల్సిన పనిలేదా? అని టీచర్లే ప్రశ్నిస్తున్నారు. ఇప్పటి వరకూ నిర్వహించిన ఉద్యోగోన్నతులు, సర్దుబాట్లు సైతం 2022 నిబంధనల మేరకు సాగాయి. కానీ ఇప్పుడు బీఈడీలో మెథడాలజీని బట్టి ఇష్టానుసారంగా సబ్జెక్టులను మార్చడంతో ఉపాధ్యాయులకు దిక్కు తోచడం లేదు. 20 ఏళ్లుగా హిందీ పాఠాలు చెబుతున్న టీచర్‌ను ఉన్నపళాన మరో స్కూల్‌లో ఆంగ్లం బోధించాలని పంపడం గందరగోళంగా మారింది.

ఎనిమిది తరగతులకు సోషల్ టీచరే ఒక్కరే!

ఇప్పుడు జరగుతున్న సర్దుబాటు కారణంగా ఓ సోషల్ టీచర్ ఎనిమిది తరగతులకు పాఠాలు చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి బదులు అర్హులైన టీచర్లకు ఉద్యోన్నతులు కల్పించి సబ్జెక్ట్ ఉపాధ్యాయుల కొరతను అధిగమించే అవకాశం ఉన్నప్పటికీ విద్యాశాఖ ఎందుకు ఇలా వ్యవహరిస్తుందో అంతుబట్టడం లేదని ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి.

కుప్పంపై ఎందుకంత ప్రేమో!?

మరోవైపు పలమనేరు ప్రాంతంలో పట్టణానికి ఆనుకుని కొన్ని ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. తక్కువగా విద్యార్థుల సంఖ్య ఉంటూ ఎక్కువమంది టీచర్లు స్కూళ్ల నుంచి టీచర్లను కుప్పంలోని గ్రామీణ పాఠశాలలకు బదిలీ చేస్తున్నారు. కేవలం అక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్న సీఎం చంద్రబాబు మెప్పు పొందడం కోసం జిల్లా విద్యాశాఖ ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటోందనే విమర్శలొస్తున్నాయి. ఉపాధ్యాయ సంఘాలు కూడా ఈ అసంబద్ధ సర్దుబాట్లపై ఆందోళనలకు సన్నద్ధమవుతోంది.

యూటీఎఫ్ ఆందోళన



పలమనేరులో ఆందోళన చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

- పాతపెన్షన్ స్కీమ్ పునరుద్ధరించాలని డిమాండ్

పుంగనూరు: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు శుక్రవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ, పాతపెన్షన్ తప్ప మరే పెన్షన్ వద్దని, పెన్షన్ అనేది భిక్ష కాదన్నారు. పాత పెన్షన్‌కు పొంతనలేని నిర్ణయాలతో కార్పొరేటర్లకు మాత్రమే లాభం కలిగిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ ఉద్యోగుల సొమ్ముతో కార్పొరేటర్లకు పెట్టుబడులా? అని ప్రశ్నించారు. ఉద్యోగ ఉపాధ్యాయుల కాంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు షబ్బీర్ అహమ్మద్, పోతయ్య, సుధాకర్, సూర్యప్రకాష్, రామయ్య, జగన్నాథరాజు, రమేష్, జగన్‌మోహన్‌రెడ్డి, రమణ, సురేంద్రరెడ్డి, రెడ్డెప్ప, శంకర్‌రెడ్డి, లోకనాథరెడ్డి, పీతాంబరరావు తదితరులు పాల్గొన్నారు.



పుంగనూరు: తహసీల్దార్ కార్యాలయం వద్ద..

పలమనేరులో..

పలమనేరు: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యూపీఎస్‌కు బదులు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలంటూ యూటీఎఫ్ నాయకులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రమణ మాట్లాడుతూ, ఉద్యోగులకు పెన్షన్ అనేది భిక్ష కాదని..ఉద్యోగుల హక్కు అని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఇప్పుడు కేంద్రం చెబుతున్న యూపీఎస్ విధానం తమకు తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తుందని నిరసన వ్యక్తం చేశారు. ఇకనైనా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రకాష్, కృష్ణమూర్తి, ప్రసన్నకుమార్, ప్రజాసంఘాలు, ఎల్ఐసీ సంఘాల నేతల పాల్గొన్నారు.

ఒకరికి వీడ్కోలు.. మరొకరికి స్వాగతం

వి.కోట: పదేళ్లుగా వి.కోట మేజర్ పంచాయతీకి ఎనలేని సేవలందించిన పంచాయతీ కార్యదర్శి (ఈఓ)యాదవపతి సేవలు వెలకట్టలేనివని సర్పంచ్ పీఎస్ లక్ష్మి కొనియాడారు. శుక్రవారం ఈఓకు వీడ్కోలు సన్మానం చేశారు. ఆయన సేవలను ప్రస్తుతించారు.గుడిపల్లె మండలంలోని యామిగానిపల్లెకు యాదవపతి బదిలీ అయ్యారు. అక్కడ పని చేస్తున్న ఈఓ శివశంఖర్ వి.కోట మేజర్ పంచాయతీ ఈఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో యాదవపతికి వీడ్కోలు, నూతన ఈఓకు స్వాగత కార్యక్రమాలు సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వార్డు సభ్యులు కుమార్‌రాజా, వేణు, బీడాబాబు, మంజుల, విశాలాక్షి, ఖాదర్, నాగరత్న, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



ఈఓలు యాదవపతి, శివశంకర్‌లను సన్మానిస్తున్న సర్పంచ్ లక్ష్మి, వార్డు సభ్యులు

జ్వరాలపై ఇంటింటా సర్వే



నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది

గుడిపాల: ప్రస్తుత సీజన్‌లో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు వహించాలని గుడిపాల పీహెచ్‌సీ వైద్యాధికారి సంధ్య అన్నారు. శుక్రవారం మండలంలోని వసంతాపురం, గుడిపాలలో జ్వరాలపై ఇంటింటా సర్వే నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కొబ్బరి బోండాలు, నీటితొట్టెలు, ప్లాస్టిక్ డబ్బాల్లో నీరు రోజులు తరబడీ నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఇళ్లలో నీటినిల్వలు తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఏఎన్ఎం జబసెల్వి, సీహెచ్ఓ ఉమామహేశ్వరి, సిబ్బంది సుజిమ, స్వప్న పాల్గొన్నారు.

పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు



పలమనేరు డిగ్రీ కళాశాలలో వనమహోత్సవ ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



వనమహోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

- ప్రాంతీయ సంయుక్త సంచాలకులు బాబు

పలమనేరు: చెట్లు ప్రగతికి మెట్లు అని కడప ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాబు అన్నారు. శుక్రవారం స్థానిక కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం వనమహోత్సవం నిర్వహించింది. కళాశాల ఆవరణలో మొక్కలు నాటి ఆయన మాట్లాడారు. చెట్లు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రవీంద్రనాథ్, వెంకటేష్‌బాబు, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ మొక్కలు నాటారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల, ఉర్దూ పాఠశాలల్లో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో డీఈవో దేవరాజులు పాల్గొన్నారు. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఎంఈఓ లీలారాణి, హెచ్‌ఎంలు షంషీర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



గంగవరం: డీఎఫ్‌ఓకు మొక్కలను అందజేస్తున్న కళాశాల అధ్యాపకులు

మానవాళి మనుగడకు వృక్షాలే ఆధారం

గంగవరం: మానవాళి మనుగడకు పచ్చనిచెట్లే కారణమని, వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని డీఎఫ్‌ఓ చైతన్యకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వనమహోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఎఫ్‌ఓ మాట్లాడారు. వేసవిలో వర్షాలు కురవడం, వర్షాకాలంలో ఎండలు విపరీతంగా కాయడం వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులే కారణమన్నారు. ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలు తలెత్తకుండా ఉండాలంటే పర్యావరణ సమతుల్యతకు పాటు పడాలని, ఈ దిశగా విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు.



పలమనేరు హైస్కూల్‌లో..

అనుగుణంగా ప్రకృతి ఎప్పుడైతే సహకరించదో పర్యావరణ లోభాయిష్టే దానికి కారణం అవుతుందన్నారు. అనంతరం దాదాపు వెయ్యి మొక్కలను విద్యార్థులకు పంపిణీ చేశారు. పలమనేరు ఎఫ్ఆర్‌ఓ శివన్న, కళాశాల కరస్పాండెంట్ వెంకటరమణారెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మీసుధ, అధ్యాపకులు పాల్గొన్నారు.

వన మహోత్సవం

గంగవరం: మొక్కలు పెంచి, వాటిని సంరక్షిస్తే పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములైనట్లేనని మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు అన్నారు. మండలంలోని మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శుక్రవారం వనమహోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రాంగణం నలువైపులా జాతీయ రహదారి ఆనుకుని దాదాపు 150 మొక్కలను నాటారు. కళాశాల చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మ్యాథ్స్ లెక్చరర్ పోస్టు భర్తీకి చర్యలు

పూతలపట్టు: ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను గెస్ట్ ఫ్యాకల్టీతో భర్తీ చేయవచ్చని ప్రభుత్వం అనుమతించిందని, ఈ మేరకు ఖాళీగా తమ కాలేజీలో ఖాళీగా ఉన్న గణిత అధ్యాపక పోస్టును భర్తీ చేయనున్నట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ మ్యాథ్స్ చేసిన వారు అర్హులని, వారు వచ్చే నెల 2వ తేది తమ కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో సంప్రదించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9963463863కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.